క్లుప్తంగా

ప్రభుత్వ ఉద్యోగమంటే సామాజిక బాధ్యత

జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ



గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగమంటే కేవలం ఉపాధి మార్గమే కాదని, సామాజిక బాధ్యతగా గుర్తెరగాలని జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐదుగురికి జేసీ కారుణ్య నియామక ఉత్తర్వులతోపాటు, ముగ్గురు దివ్యాంగులకు స్పెషల్ డ్రైవ్ కింద ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఉద్యోగావకాశాలు పొందిన వారు ముందుగా పని నేర్చుకోవాలన్నారు. సీనియర్స్‌తో, ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ సువార్త పాల్గొన్నారు.

24 నుంచి ఆహ్వాన నాటిక పోటీలు

నగరంపాలెం: స్థానిక మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 24, 25, 26 తేదీల్లో అల్లు రామలింగయ్య నాటక కళాపరిషత్- వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు పి.శివప్రసాద్ తెలిపారు. సోమవారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నాటికల బ్రోచర్లను విడుదల చేశారు. చివరి రోజు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు ఆర్.రామకృష్ణ, కార్యదర్శి దళవాయి సుబ్రమణ్యం, కోశాధికారి తట్టల శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్‌కు హిందూ కళాశాల విద్యార్థి

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయిలో జరగనున్న జిమ్నాస్టిక్స్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరఫున పోటీ పడనున్న జట్టులో హిందూ కళాశాల విద్యార్థి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. మల్లిఖార్జునప్రసాద్ తెలిపారు. సోమవారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిమ్నాస్టిక్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో గుంటూరులోని బీఆర్ స్టేడియంలో జరిగిన అండర్17,19 అంతర్ జిల్లా జిమ్నాస్టిక్ పోటీల్లో కళాశాల తరఫున జూనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి జె. రామ్‌సాయి టేబుల్ వాల్ట్, ఫ్లోర్, పామెల్ హార్స్‌లలో ప్రథమ, తృతీయ స్థానాలు గెలవడంతో పాటు ఓవరాల్‌గా ప్రతిభ చూపినట్లు వివరించారు. అత్యుత్తమ ప్రతిభతో రాష్ట్రం తరఫున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈసందర్భంగా విద్యార్థిని కళాశాల యాజమాన్యంతో పాటో అధ్యాపకులు అభినందించారు.

అనిల్‌పై భాజపా యువమోర్చా మాజీ కార్యదర్శి ఫిర్యాదు

నగరంపాలెం: గతంలో అమరావతి రైతుల ఉద్యమానికి వెళ్లి వస్తున్న ప్రస్తుత ఆరోగ్య శాఖ మంత్రి, భాజపా జాతీ య కార్యదర్శి సత్యకుమార్ యాదవ్‌పై బోరుగడ్డ అనిల్‌కుమార్ దాడికి పాల్పడిన ఘటనపై ఫిర్యాదు చేసినట్లు ఆ పార్టీ యువమోర్చా మాజీ కార్యదర్శి పి.సురేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

పట్నంబజారు: మహిళ మెడలో నుండి చైన్ లాక్కుని పరారైన సంఘటనపై కేసు నమోదయింది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఐపీడీ కాలనీలో నివాసం ఉండే బొమ్మారెడ్డి పద్మావతి సోమవారం మధ్యాహ్నం ఇంటి నుండి బయటకు వస్తున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగుడు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని నల్లపూసలు, నానతాడు లాక్కుని పరారీ అయ్యాడు. ఈ క్రమంలో ఆమె గొలుసు గట్టిగా పట్టుకోవడంతో కొద్దిమేరకు ఆమె చేతిలోనే నిలిచిపోయింది. రూపాయలు రెండు లక్షల విలువచేసే 30 గ్రాములు పైన బంగారం చోరీకి గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యానికి వా'కింగ్'

'కాళ్లు రోడ్డెక్కితే రోగం అటకెక్కుతుందట'. అందుకే 'నడకకు కాలంతో పనిలేదు కాళ్లతో నేంటారు' కొందరు. అందుకేనేమో కాళ్లు ముందడుగు వేస్తే రోగం వెనకంజ వేస్తుందని సుద్దులు చెబుతుంటారు. 'బాగా నడిచే వారికి మంచి ఆరోగ్యం లభించడమే కాదు.. మంచి స్నేహితులు కూడా పరిచయం అవుతారట'. 'కాళ్లు కష్టపడితే ఒళ్లు సుఖపడుతుందని' బాగా నడకలో ప్రావీణ్యం సంపాదించిన ఓ వ్యక్తి మాట. ఇలా ఎన్నో ఉపయోగాలు నడక వల్ల సాధ్యమవుతాయి. ఈ నడకనే కొందరు నిత్యం అనుసరిస్తూ శరీరాన్ని-ఆరోగ్యాన్ని పదిలపరుచుకుంటున్నారు గుంటూరులో.

- మారుతున్న జీవన శైలితో నడకకు పెరుగుతున్న ప్రాధాన్యత
- పట్టణాల్లోని పార్కుల్లో ప్రత్యేక ట్రాక్‌ల ఏర్పాటు
- ప్రజల్లో ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధ
- శారీరక దారుఢ్యంతో పాటు ఆరోగ్యం
- నిత్య ప్రక్రియగా మార్చుకోవాలంటున్న వైద్యులు



కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌పై వాకింగ్ చేస్తున్న నగరవాసులు

కొరిటెపాడు(గుంటూరు): నడక ఆరోగ్యానికి ప్రధాన సూత్రం. నిత్యం నడిస్తే ఎన్నో వ్యాధుల ముప్పును తప్పించుకోవచ్చని నిపుణులు సైతం పేర్కొంటున్నారు. మారుతున్న జీవనశైలితో ఊబకాయం, షుగర్, బీపీ వ్యాధి గ్రస్తులకు నడక తప్పనిసరి అని వైద్యులు చెబుతున్నారు. మాత్రల కన్నా నడకతోనే వ్యాధిని నివారించవచ్చని, అదుపులో ఉంచుకోవచ్చంటున్నారు. ఇప్పటికే ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో నడకను కొనసాగిస్తున్నారు.

ముఖ్యంగా పట్టణవాసులు నడకను తమ జీవితంలో భాగం చేసుకుంటున్నారు. సూర్యోదయానికి ముందే మైదానాలు, పార్కులు, పట్టణ శివారు ప్రాంతాలకు వెళ్లి కనీసం గంటపాటు నడక సాగిస్తున్నారు. వీలుకాని కొందరు ఇంట్లోనే ట్రిడ్ మిల్, సమీపంలోని రోడ్లపై నడుస్తున్నారు. గుంటూరు నగరంలోని బ్రహ్మానంద రెడ్డి స్టేడియం, ఎన్టీఆర్ స్టేడియం, కొరిటెపాడు పార్కు, అరండల్‌పేట పార్కు, గుజ్జనగుండ్ల పార్కు, ఆర్టీసీ కాలనీ పార్కు, ఏటీ అగ్రహారంలోని పార్కు, కృష్ణనగర్ పార్కు, పోలీసు పెరేడ్ గ్రౌండ్, పిచుకలగుంట గ్రౌండ్, మాజేటి గురవయ్య హైస్కూల్ తదితర ప్రాంతాలు, జిమ్‌లు ఉదయం, సాయంత్రం వేళల్లో కిటకిటలాడుతున్నాయి. వృద్ధులు, యువత పలు ప్రధాన ప్రాంతాల్లో వాకింగ్, వ్యాయామం చేస్తున్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం వాకింగ్ చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని వ్యాయామ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. గతంలో 500 నుంచి 1000 మంది వాకింగ్ చేసేవారని, ఇప్పుడు వేల సంఖ్యలో వాకింగ్‌కు వెళ్తున్నారని చెబుతున్నారు. రోజుకు గంట వ్యాయామం చేయడం ద్వారా శారీరక ధృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఆలోచనా సామర్థ్యం సైతం పెరుగుతుందని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలు..

ప్రతిరోజూ నడకతో బీపీ, షుగర్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. గుండె జబ్బులు, కొలెస్ట్రాల్, కీళ్ల, మోకాళ్ల నొప్పులు, ఆందోళన, మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చు. శారీరక శ్రమతో చిన్నారులను ఆడించడం ద్వారా వారిలో ఎదుగుదల, మానసిక పరిపక్వత, ఏకాగ్రత, మంచి ఆలోచనా శక్తి పెరుగుతుంది.

అధిక బరువును తగ్గించుకునేందుకు...

ప్రస్తుత జీవన విధానంలో వచ్చిన మార్పుల కారణంగా జనాభాలో అధిక శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువత అధిక బరువు కారణంగా వ్యాధుల బారిన పడుతున్నారు. ఫాస్ట్‌ఫుడ్స్, కేక్‌లు, పిజ్జాలు, బర్గర్లు, చాట్స్ వంటి జంక్ ఫుడ్స్‌ను అధికంగా తీసుకోవడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. అధిక బరువుతో బాధపడుతున్న వారు వాకింగ్ ట్రాక్‌లలో పరుగులు తీస్తుండగా మరి కొందరు యోగా సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. పట్టణంలోని పలు పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు, జిమ్ పరికరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో సమీప ప్రాంతాల వాసులు పార్కుల్లో వాకింగ్ చేస్తున్నారు.

షుగర్ నియంత్రణలో ఉంది



నా వయస్సు 92 సంవత్సరాలు. గత 25 ఏళ్లుగా వాకింగ్ చేస్తున్నా. రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో గంట పాటు నడుస్తున్నా. షుగర్, బీపీ నియంత్రణలోనే ఉంది. బలహీనత తెలియడం లేదు. ఆరోగ్యంగా ఉంటున్నా. నడక కారణంగా శరీరం చలాకీగా ఉంటోంది. -ఆలపాటి ధర్మారావు, కొరిటెపాడు. గుంటూరు.

నిద్ర బాగా పడుతుంది



క్రమం తప్పకుండా 20 ఏళ్లుగా వాకింగ్ చేస్తున్నా. ఉదయం, సాయంత్రం తప్పకుండా వాకింగ్ చేస్తా. చలాకీగా ఉంటున్నా. ఆరోగ్య సమస్యలు లేవు. నడకతోనే ఆరోగ్యం. -కె.సాంబిరెడ్డి, కొరిటెపాడు, గుంటూరు.

గుంతలు పూడ్చివేత



నగరంపాలెం: లాలాపేట చినబజార్ వీధిలో ప్రమాదభరితంగా మారిన గుంతలను పూడ్చివేశారు. సోమవారం సాక్షి తూర్పు జోన్ పేజీలో ప్రచురితమైన 'తవ్వి వదిలేశారు' కథనానికి జీఎంసీ అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం తాత్కాలికంగా గుంతలను చదును చేయించారు. నూతన సీసీ కల్వర్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించగా, టెండర్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. టెండర్ ప్రక్రియ ముగిసిన వెంటనే నూతన సీసీ కల్వర్టు నిర్మాణ పనులు చేపడతామని పేర్కొన్నారు.

సాక్షి ఎఫెక్ట్

ప్రభుత్వ స్థల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

పెదకాకాని: ప్రభుత్వ స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని పెదకాకాని గ్రామానికి చెందిన పెండ్యాల సురేష్ సోమవారం గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఫిర్యాదుల దినోత్సవ కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. పెదకాకాని ప్రధాన సెంటర్‌లో శివాలయం ఆర్చి ప్రక్కనే సర్వేనెంబరు 557 లో 25 సెంట్లు ప్రభుత్వ స్థలం ఉంది. ఆ స్థలంలో ఉన్న గ్రంధాలయం శిథిలావస్థకు చేరడం, రహదారి విస్తరణతో గ్రంధాలయం స్థలం రోడ్డులో కలసి పోయింది. ప్రక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని 2014 సంవత్సరంలో భవానీ మహిళా ట్రస్ట్ పేరుతో ఆక్రమించుకున్నారు. ఆ స్థలాన్ని పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకున్నప్పటికీ న్యాయస్థానాన్ని తప్పుడు సమాచారంతో నమ్మించి స్టే తెచ్చారన్నారు. వాస్తవానికి ఆ ట్రస్ట్ గ్రామానికి చెందిన తల్లి, కుమార్తెలు మాత్రమే ఉన్నారని, ఆ స్థలాన్ని వారే ఆక్రమించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ స్థలం ఎదురుగా రోడ్లపై చిరువ్యాపారాలు చేసుకునే వారి వద్ద నుండి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారన్నారు. ఆ స్థలాన్ని పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకుని గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా గ్రంథాలయం నిర్మించాలని పెండ్యాల సురేష్ గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటెపాడు(గుంటూరు): 11 కేవీ లైన్ మెయింట్‌నెన్స్, చెట్లు తొలగించడానికి లైన్ క్లియర్ తీసుకోవడం జరిగిందని డి-8 విద్యుత్‌శాఖ ఏఈ జి.నాగరాజకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డి-8 సెక్షన్ పరిధిలోని బ్రాడీపేట 2/21 నుంచి 4/21. జగన్మోహన్ రైస్ మిల్ ఏరియాలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

కొరిటెపాడు(గుంటూరు): ప్రకృతి వ్యవసాయంతోనే నాణ్యమైన అధిక దిగుబడులు పొందొచ్చని ఇండో-జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రో ఎకోలాజికల్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్‌కు చెందిన ఈడీ, విశ్రాంత ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కృషీభవన్‌లో ప్రకృతి వ్యవసాయంపై రైతు శాస్త్రవేత్తలకు సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

విద్యుత్ చార్జీల భారం మోపవద్దు

లక్ష్మీపురం: విద్యుత్ చార్జీల పెంపు.. ట్రూ అప్ చార్జీల విధింపు.. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వంటి విద్యుత్ భారాన్ని ప్రజలపై రుద్దవద్దని, విద్యుత్ చార్జీల బాదుడు నుండి ప్రజలకు విముక్తి కలిగించాలని వినియోగదారుల సంఘ నాయకులు ఆర్.వెంకటరత్నం డిమాండ్ చేశారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో వేలకోట్ల రూపాయల భారాన్ని విద్యుత్ వినియోగదారులకు మోపటాన్ని నిరసిస్తూ సంస్థ సభ్యులు సోమవారం కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది అవధానుల హరి, మేధావుల ఫోరం నాయకులు పిఎస్ మూర్తి తదితరులు ప్రసంగించారు.

ఎన్‌సీసీ బీ సర్టిఫికెట్ పరీక్షలో నూరుశాతం ఉత్తీర్ణత

గుంటూరు ఎడ్యుకేషన్: 25 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కేడెట్స్ బీ సర్టిఫికెట్ పరీక్షలో టీజేపీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీ బీ సర్టిఫికెట్ పరీక్షలో ఉత్తీర్ణులైన 19 మంది కేడెట్లకు కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి మేజర్ పి.కుమార్ రాజా, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో సత్తాచాటిన కేఎల్పీ విద్యార్థులు



విద్యార్థులతో డాక్టర్ కృష్ణప్రసాద్, రత్తయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాస్థాయి చదరంగ పోటీల్లో డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి. రత్తయ్య తెలిపారు. సోమవారం జేకేసీ కళాశాల రోడ్డులోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రత్తయ్య మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న జరిగిన అండర్-14, 17 జిల్లా స్థాయి చదరంగ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు బి. ప్రదీప్, పి.యశ్వంత్ రాజ్‌కుమార్, సీహెచ్ లక్ష్మీ చేతన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవ పున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ఏవో కె.వెంకట్రావు విద్యార్థులను అభినందించారు.

సుమేధ హైస్కూల్లో బాలోత్సవ్-7 ప్రారంభం



గాల్లోకి బెలూన్లు వదులుతున్న తిరుపతిరెడ్డి, రామారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో సోమవారం బాలోత్సవ్-7 వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా నేషనల్ గ్రీన్ కార్ప్స్ జిల్లా మాజీ సమన్వయకర్త డి. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ చిన్నారుల్లో ప్రతిభా పాటవాలను వెలికితీయడంతో పాటు, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. నగరపాలకసంస్థ ఎంహెచ్‌వో జె. రామారావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని అన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు మురుగుడు శ్రీహరి మాట్లాడుతూ ఆటలతో విద్యార్థులు మానసిక ఆనందం, ఆరోగ్యంతో ఉంటారని అన్నారు. పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ బాల, బాలికలకు గేమ్స్, స్పోర్ట్స్, లిటరరీ కల్చరల్ తదితర 32 అంశాల్లో పోటీలను నిర్వహించి విజేతలకు మూడువేలకు పైగా బహుమతులను అందజేస్తామని తెలిపారు. క్రీడలతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక నైపుణ్యాలను బాలోత్సవం ద్వారా వెలికి తీస్తామని తెలిపారు. ఈసందర్భంగా చిన్నారుల ఆకాంక్షలకు అనుగుణంగా బెలూన్లను గాలిలోకి వదిలి, బాలోత్సవం-7ను అధికారికంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుక్మిణీ కల్యాణ పారాయణం శ్రేయస్కరం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కల్యాణ వేదికపై సోమవారం శ్రీమద్భాగవతం- రుక్మిణీ కల్యాణం, కుచేలోపాఖ్యానం ధారావాహిక ప్రవచనాలు మొదలయ్యాయి. ఆలయ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, యల్లాప్రగడ మల్లికార్జున రావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. బ్రహ్మశ్రీ మల్లాది కైలాసనాథ్ మాట్లాడుతూ నేటి యువ తరం రుక్మిణీ కళ్యాణ ఘట్టాన్ని శ్రద్ధగా చదవాలన్నారు. అవివాహితులకు ఒకవేళ పురాణం ఆలకించినా, పారాయణం చేసినా వారికి వివాహం అవుతుందని, చక్కటి వైవాహిక జీవితం, ఆధ్యాత్మికత లభిస్తుందని పేర్కొన్నారు.

మాజీ ఎంపీ శివాజీని పరామర్శించిన తెలంగాణ మంత్రి



మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సత్కరించిన మాజీ ఎంపీ శివాజీ

గుంటూరు ఎడ్యుకేషన్: అనారోగ్యానికి గురై గొంతు శస్త్ర చికిత్స చేయించుకున్న రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. సోమవారం బృందావన్‌గార్డెన్స్‌లోని శివాజీ నివాసానికి వెళ్లిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయన శివాజీ ఆరోగ్య పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి తామిద్దరం సన్నిహితులమని, తెలుగు రాష్ట్రాల్లో రైతురుణ మాఫీ తీసుకురావడం వెనుక శివాజీ కృషి ఉందని మంత్రి చెప్పారు. తాను రాజకీయాల్లో కొనసాగేందుకు శివాజీనే ఆదర్శమని, గతంలో నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు పులిచింతల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు దిశా నిర్దేశం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దాసరి హనుమంతరావు, రైతునేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, కొడాలి వీరభద్రరావు, పాటిబండ్ల విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నాలెడ్జ్, స్కిల్స్ పెంపొందాలి

ఎన్ఐటీటీటీఆర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఎమర్జింగ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ మైత్రేయీ దత్త



చేబ్రోలు: విద్యార్థుల్లో నాలెడ్జ్‌తో పాటు స్కిల్స్‌ను పెంపొందించాలని చండీఘర్‌లోని ఎన్ఐటీటీటీఆర్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్ ట్రె నింగ్ అండ్ రీసెర్చ్) ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఎమర్జింగ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ మైత్రేయీ దత్త అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో '' అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ (ఓబీఈ) అండ్ అక్రిడిటేషన్'' అనే అంశంపై 5 రోజుల పాటు నిర్వహించనున్న ట్రెనింగ్ ప్రోగ్రాంను సోమవారం వైస్ చాన్స్‌లర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చండీఘర్‌లోని ఎన్ఐటీటీటీఆర్- ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఎమర్జింగ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ మైత్రేయీ దత్త మాట్లాడుతూ విద్యార్థుల సాంకేతిక, సామాజిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, వాటిని ఉపయోగించి వారు భవిష్యత్‌లో ఎలా నిలదొక్కుకుంటారనే అంశాలను బట్టి వారి విద్యా ప్రయాణం ఉంటుందనేదే ఓబీఈ విధానంలోని ప్రత్యేకతని తెలియజేసారు. ఈ విధానంలో విద్యార్థులు చదువుతున్న సబ్జెక్టు ఫలితాలు ముందే నిర్దేశించబడతాయన్నారు. వాటి ఆధారంగా విద్యా కార్యక్రమాలు, బోధన పద్ధతులు రూపకల్పన చేస్తామన్నారు. విద్యార్థులు సబ్జెక్టులను మాత్రమే నేర్చుకోకుండా వారి నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించడానికి ఓబీఈ తోడ్పడుతుందన్నారు. విద్యార్థుల ఆలోచనా పద్ధతులు, పరిష్కార నైపుణ్యాలను పొందేందుకు ఇది సహాయపడుతుందని తెలియజేశారు. మార్కెట్ అవసరాలకనుగుణంగా విద్యా విధానం ఉండేలా విద్యార్థులను సిద్ధం చేస్తుందన్నారు. నైపుణ్యాలను ప్రాధాన్యతగా తీసుకోవడం ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని వెల్లడించారు. విద్యార్థులు కేవలం సబ్జెక్టుల ను మాత్రమే కాకుండా వ్యావహారిక పరిజ్ఞానం పొందడం వలన సమగ్ర అభ్యాసం పొందుతారని తెలి పారు. విద్యార్థులు లక్ష్యాలను ఎలా సాధిస్తున్నారు అనేది పరిశీలించి, వారి పనితీరును జాగ్రత్తగా మూల్యాంకనం చేస్తామన్నారు. విద్యార్థుల వ్యక్తిగత, వత్తి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించే ప్రాక్టికల్ పనితీరు, అనుభవం ఆధారంగా ర్యాంకులు కాకుండా ఫలితాల ఆధారంగా గుర్తింపు వస్తుందన్నారు. విద్యా సంస్థల ప్రదర్శన ప్రమాణాలను, వారి చదువు ప్రణాళికలను విశ్లేషించి అక్రిడిటేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఏఐసీటీఈ, ఎన్‌బీఏ వంటి గుర్తింపు సంస్థలు ఓబీఈ పద్ధతులను పాటించే సంస్థలకు గుర్తింపు ఇస్తాయన్నారు. అక్రిడిటేషన్ అనేది విద్యాసంస్థలు, ముఖ్యంగా ఇంజనీరింగ్, టెక్నాలజీ రంగాల్లో, నాణ్యత ప్రమాణా లను పాటిస్తున్నాయా లేదా అని జాగ్రత్తగా పరిశీలించి గుర్తింపు ఇవ్వడం జరుగుతుందన్నారు. అక్రిడిటేషన్ ఉండటం వల్ల విద్యాసంస్థలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందడంతో పాటు విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, ఇంచార్జి రిజిస్ట్రార్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

జమిలీ ఎన్నికలు పెట్టుబడిదారులకు మేలు

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు



మాట్లాడుతున్న బీవీ రాఘవులు

లక్ష్మీపురం: పెట్టుబడిదారులకు మేలు చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జమిలీ ఎన్నికల నినాదాన్ని తెరపైకి తెచ్చారని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు విమర్శించారు. స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వి.ఐ లెనిన్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సమకాలిన రాజకీయ పరిణామాలపై నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. సభకు సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అధ్యక్షత వహించారు. రాఘవులు ప్రసంగిస్తూ దేశంలో అన్ని రకాల ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు హేతుబద్ధతలేని సాకులను మోడీ ప్రభుత్వం చెబుతుందన్నారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్. బాబూరావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజి, ఈమని అప్పారావు, ఎస్.భావన్నారాయణ, కె.నళినీకాంత్, ఎమ్.రవి, ఎస్.ఎస్.చెంగయ్య పాల్గొన్నారు.

ఏబీవీపీ నూతన కార్యవర్గం నియామకం

ఏఎన్‌యూ: ఏబీవీపీ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ శాఖ నూతన కార్యవర్గం నియామకం జరిగిందని ఏబీవీపీ నాయకులు పవన్ తెలిపారు. యూని వర్సిటీ శాఖ ఇన్‌చార్జ్‌గా సీహెచ్ మోహన్ రావు, ,అధ్యక్షురాలిగా వై సాయి చంద్రిక, సెక్రటరీగా వంశీ , వైస్ ప్రెసిడెంట్‌లుగా హేమంత్ రామ్, మణికంఠ, యుగంధర్, జాయింట్ సెక్రటరీలుగా ఎ.వేదశ్రీ, గంగాధర్, వాసు నియామకమయ్యారన్నారు.

కూటమి హామీ తక్షణమే అమలు చేయాలి

రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య



జేసీ భార్గవ్ తేజకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

లక్ష్మీపురం: ఎన్నికల ముందు కూటమీ ప్రభుత్వం వలంటీర్స్‌కు ఏదైతే హామీ ఇచ్చారో వాటిని తక్షణమే అమలు పరచాల్సిందిగా రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటరీ అసోసియేషన్ ఏఐవైఎఫ్ అనుబంధం సంస్థ ఆధ్వర్యంలో అన్ని జిల్లాలో నిరసన కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్స్ వ్యవస్థ కరోనా లాంటి సమయంలో చేసినా పనులను కొనియాడారు. కరోనా పేషెంట్స్ దగరకు వెళ్లి టాబ్లెట్స్ భోజనాలు తదితర సహాయాలు అందజేయడంతో పాటు సేవ చేయటంలో వలంటీర్స్ ప్రత్యేక పాత్ర పోషించడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వాలంటీర్స్‌కు కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నెలకు రూ.10వేలు, అలాగే ఉద్యోగ భద్రత కల్పించడం జరుగుతుందని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అదేవిధంగా గత 3 నెలల నుంచి పెండింగ్ లో ఉన్న జీతాలు విడుదల చేయాలనీ డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజకు వినతి పత్రం అందించారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ వలంటీర్స్ అసోసియేషన్ నాయకులు కోలా రాజేష్, వెంకట్ నాగరాజ్, రమేష్, బాజీ, నజీర్, పుష్ప, తిరుపతమ్మ, బిందు, సతీష్, దాస్, రాజారావు తదితర వలంటీర్స్ నాయకులు పాల్గొన్నారు.

బాబు పేరు చెప్పి.. వృద్ధురాలి వద్ద లక్ష టోకరా

లక్ష్మీపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా కానుక మంజూరు కావాలంటే పసుపు రంగు చీర పైనే రూ.20 వేలు పెట్టి ఫోటో దిగితే కొన్ని గృహోపకరణాలు ఇస్తారని చెప్పి వృద్ధురాలిని నమ్మబలికి ఆమె వద్ద రూ.1 లక్ష తీసుకుని పరారైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పట్టాభిపురం పోలీసుల కథనం ప్రకారం ఆశోక్‌నగర్ 4/2 అడ్డరోడ్డు ప్రాంతానికి చెందిన చెరుకూరి శివకుమారి అనే 75 సంవత్సరాల వృద్ధురాలు ఇంటికి ఒక వ్యక్తి ద్విచక్రవాహనం పై వచ్చి మీకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా కానుకగా ఫ్రిజ్, టీ.వి, గ్రైండర్ ఇస్తున్నారని నమ్మబలికాడు. అయితే చంద్రబాబు దసరా కానుక రావాలంటే పసుపు రంగు చీరా పై రూ.20 వేలు పెట్టి ఫోటో దిగాలని చెప్పడంతో వృద్ధురాలు నమ్మి ఇంట్లో నుంచి పసుపు రంగు చీరాతో పాటు రూ.1 లక్ష నగదు తీసుకుని బయటకు వచ్చింది. ఇదే అదునుగా భావించి పసుపు రంగు చీరతో పాటు ఎరుపు రంగు చీర కూడా ఉండాలని చెప్పడంతో పసుపు రంగు చీర, రూ.1 లక్ష నగదు ఆ వ్యక్తి చేతిలో పెట్టి మళ్లీ ఇంట్లోకి వెళ్లడంతో వెంటనే సదరు వ్యక్తి పరారయ్యాడు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.